# స్నేహ ధర్మం

మొదటి బహుమతి

(రూ. 50)

అందరు బస్‌స్టాండు ప్రయాణీకులతో క్రిక్కిరిసి వుంది. నేను రిక్షాదిగి, త్వరగా బుకింగ్ ఆఫీసు దగ్గరకు నడిచాను. 'కవుతరం ఒక టిక్కెట్ యివ్వండి' అని టిక్కెట్టు తీసుకొని, మావూరు వెళ్ళే బస్సులో ఎక్కి కూర్చున్నాను.

బస్సులో, నా వెనక సీటులో ఎవరో దెబ్బలాడు కుంటున్నారు. ఆ అనాగరిక జాతినిచూచి, అసహ్యించుకొని, ముఖాన్ని ప్రక్కకు త్రిప్పుకున్నాను. 'ఫట్' మని చెంపదెబ్బ వినిపించింది. వెనక్కు తిరిగి చూచాను. ఎవరో ప్రయాణీకుడు త్రాగివుండి, మైకంలో ప్రక్కవానిపై నోరుజారి చెంపదెబ్బ తిన్నాడు. అతను చొక్కాతో కంటినీరు తుడుచుకుంటున్నాడు ఆ ముఖం ఎక్కడో పరిచయమున్నట్లనిపించింది. అతని ముఖంలోకి పరిశీలనగా చూచాను. నా మనస్సులో ఏవో పాతస్మృతులు మెదిలాయి.

♦ ♦ ♦

ఆ రోజునే నేను ఒకటవఫారంలో చేరాను. క్రొత్త నిక్కరు, తెల్ల చొక్కా వేసుకొని, బడిలో అడుగు పెట్టాను. నాన్నగారు బడివద్ద నన్ను వదలి, 'బడి వదిలే సమయానికి వస్తాను. భయపడక' అనిచెప్పి వెళ్ళిపోయారు. అందరూ క్రొత్తముఖాలే. భయము, సిగ్గుతో తలదించుకొని కూర్చున్నాను. ఎవరో వెనుకనుంచి వచ్చి, నా భుజంమీద చేయివేశారు. భయంగా వెనక్కు తిరిగి చూచాను. నా అంత కుర్రాడే; వెనక నుంచున్నాడు. నాకు తెలియకుండానే నా కన్నులు అతనిని ఏమిటని ప్రశ్నించాయి.

'ఒకటవ ఫారమా నువ్వు?'

అవునని సమాధానం చెప్పాను.

'నేనూ నీ క్లాసే. నా పేరు శ్రీరామమూర్తి. మరి నీ పేరు?'

'రవి.'

'నాకు స్నేహితు లెవ్వరూ లేరు. నువ్వు నా జట్టుంటావా?'

నాకు సంతోషంగా అంగీకారమైమైంది. అలా జరిగిన పరిచయం మా స్నేహానికి దారితీసింది. అనాటినుంచి మే మిద్దరం ప్రాణ స్నేహితులం. అతను పచ్చనిఛాయ. అందరితోనూ కలిసి, మెలిసి తిరుగుతూ వుండేవాడు. ఎంత అందంగావుండేవాడో, అంత బలిష్టంగా వుండేవాడు. నేను సన్నగా వుండేవాడిని.

ఒకరోజున క్లాసులో ఇంగ్లీషు పాఠం జరుగుతోంది. నేనూ, శ్రీరామమూర్తి వెనక బెంచీలో కూర్చుని

వున్నాం. అతనిని చూస్తూవుంటే ముద్దేసింది. నా ప్రేమనెలా వ్యక్త పరచాలో తెలియక అతని తెల్లని చొక్కామీద సిరామరక చేశాను. అతనూ నా చొక్కామీద సిరా విదిలించాడు. మా మనస్సులలో ఏ భావాలున్నాయో, ఆ పసివయస్సులో మాకు తెలియదు. కొద్ది క్షణాలకు యిద్దరి చొక్కాలూ సిరామయమయ్యాయి. మాష్టారిదంతా గమనించి, యిద్దరినీ దగ్గరకు పిలచి, వీపుమీద రెండు దెబ్బలేసి, క్లాసు నుంచి బయటకు పొమ్మన్నారు.

మా యిద్దరి కళ్ళలోనూ నీళ్ళు గిర్రునతిరిగాయ్. ఆ అవస్థకు కారణం నేనే. కాని, నేనలా ఒప్పుకొనేటంతలోనే అతను 'బయటికి నడు, నిన్నేం చేస్తానో' అన్నాడు. నాకూ రోషం వచ్చింది. 'ఏం చేస్తావ్! తంతాను' అన్నాను.

బయటకు రాగానే అతను నా చొక్కా కాలరు పట్టుకొని, 'ఏంరా! క్లాసులో యిష్టం వచ్చినట్లు వాగుతున్నావ్!' అని అన్నాడు.

అతని బలిష్ఠ శరీరముందు నేనెంత? బిక్కమొఖం వేశాను. కంటివెంట నీరు తిరిగింది. ఒక్కమారుగా అతను నా చొక్కా వదలివేశాడు. 'ఏడుస్తున్నావేరా!' అని అప్యాయంగా అడిగాడు.

'నువ్వు కొడ్తానన్నావుగా!' అని భయం భయంగా అన్నాను.

'ఛ, లేదురా! నిన్ను నేను కొడతానా!... మాష్టారు పిచ్చోడు. మనం పోట్లాడుకున్నా మనుకొని, మనలను తిట్టాడు ... ఛ! ఇంకా ఏడుస్తా వెందుకురా! నువ్వు ఏడిస్తే నాకూ ఏడ్పు వస్తుంది. మనమిద్దరం ప్రాణ స్నేహితులంరా. మనలను ఎవ్వరూ విడదీయలేరు. ఊరుకో... నడు. మాయింటికి పోయి, కేరమ్స్ ఆడుకుందాం' అని నన్నెంతగానో ఓదార్చాడు.

కాలచక్రం తిరుగుతూ వుంది. కాని, మా స్నేహవలయానికి అడ్డు వచ్చింది. మూడవఫారం చదువుతూ వుండగా, అతని తండ్రి చనిపోయి, అతనిచదువుకు శాశ్వతంగా అటంకం కలిగించాడు.

♦ ♦ ♦

స్టేట్ బస్ చీకటిని చీల్చుకుంటూ


## టి. ఎస్. హరగోపాల్

బి. ఇ. మూడవ సంవత్సరం.
గవర్నమెంట్ ఇంజనీరింగ్ కాలేజి,
కాకినాడ.

ముందుకు సాగుతోంది. నే నిప్పు డతనిని స్నేహితునిగా చెప్పుకోలేని స్థితిలో వున్నాను. నే నిప్పుడు ఒక విద్యావంతుడిని; బాధ్యతగల ఒక ఇంజనీరుని. అతను మత్తుగా త్రాగి వున్నాడు. నా స్నేహితుడు త్రాగుబోతు అవుతాడని నే నెన్నడూ వూహించలేదు. అతను త్రాగుబోతుగా మారటానికి కారణంకూడ నా మనస్సుకందలేదు. నా స్నేహితుడిని పలకరించలేని స్థితిలో సంఘం నన్ను విద్యావంతుడని, గౌరవనీయుడనే పదాలతో బంధించి వేసింది. నా స్నేహితుని పలకరిస్తే, ఆ త్రాగుబోతు స్నేహితుడు అని నన్ను గేలి చేస్తారేమోనన్న భయంతో నిస్సహాయంగాకూర్చుండిపోయాను.

కండక్టరు ఒక్కమారుగా 'డ్రైవర్! బస్సు ఆపు' అన్నాడు. బస్సు ఒక్కమారుగా ఆగిపోయింది. కండక్టరు 'ఎవరో ఒకరు టిక్కెట్ తీసుకోకుండా ప్రయాణం చేస్తున్నారు. ఎవరో టిక్కెట్ తీసుకోండి' అని అరిచాడు.

ప్రయాణీకు లంతా ఏకకంఠంతో 'ఆ త్రాగుబోతుగాడ్ని ముందు కనుక్కోండి' అన్నారు. కండక్టర్ అతని వద్దకువచ్చి 'ఏయ్! టిక్కెట్టు చూపించు' అన్నాడు.

'లేదు' అని మైకంలో ముద్దగా సమాధానం చెప్పా డతను.

'డబ్బులివ్వు. టిక్కెట్ యిస్తాను' అన్నాడు కండక్టరు.

'లేవ'న్నట్లుగా చేయి వూపా డతను.

మరుక్షణమే నల్గురూ కలిసి, అతనిని చేయి పుచ్చుకొని, డోరు వద్దకు నడిపి, 'ఢగెయ్' అన్నారు. అప్రయత్నంగా అతని చూపులు నా చూపులతో కలిశాయి. అతనొక్క మారుగా ఏదో గుర్తుకు వచ్చినట్లు నా వైపు చేయిజాపి, 'నువ్వు... మీరు...?' ఏదో అనబోయాడు. అతని కన్నులలో విషాదభరితమైన నీలినీడ లలముకున్నాయ్. నేను భారంగా తలను ప్రక్కకు త్రిప్పుకున్నాను.

బస్సు ముందుకు సాగింది.

దూరంగా ఆకాశంలో నీలినీడలు వర్షాన్ని కురిపిస్తున్నాయి.

□□□